క్లుప్తంగా

కుంభాభిషేకం నిర్వహించండి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న హరహర తీర్థం ఆలయ కుంభాభిషేకం నిర్వహించాలని పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాలకమండలి ఆధ్వర్యంలో రూ.43లక్షల వ్యయంతో ఆలయ జీర్ణోద్ధరణ, ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. రానున్న కార్తీక మాసం లోపు ఆలయ మహాకుంభాభిషేకం చేసేలా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు.

రుచికరమైన భోజనం పెట్టాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ: ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని పెట్టాలని, వార్డెన్ అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. ఆయన బుధవారం మధ్యాహ్నం సిబ్బందితో కలసి కనమనంబేడులోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో డీటీ చంద్రబాబునాయుడు, వీఆర్‌ఓ ప్రసాద్ పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

శ్రీకాళహస్తి: పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని లేబర్ డిపార్ట్‌మెంట్ ఏఎల్‌ఓ రంగనాథ్, శ్రీమన్నారాయణ అన్నారు. ప్రగతి సంస్థతో కలిసి బుధవారం పలు షాపింగ్‌మాల్స్, రెస్టారెంట్లను తనిఖీ చేశారు. ముగ్గురు బాలకార్మికులను గుర్తించి, నిర్వాహకులను హెచ్చరించారు. ప్రగతి సంస్థ సిబ్బంది రాజారెడ్డి, మధుబాబు, వెంకటరత్నం, మల్లికార్జున పాల్గొన్నారు.

గజవాహనంపై వీరభద్రుడు



నారాయణవనం: స్థానిక టీటీడీ అనుబంధ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఉత్సవర్లు గజవాహనంపై విహరించారు. ఉదయం 10 గంటలకు భద్రకాళీ, వీరభద్రస్వామికి స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను గజవాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఈ కార్యక్రమాలను టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు. గురువారం సాయంత్రం 3 గంటలకు రథోత్సవం, సాయంత్రం 7.30 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు రూ 500 ఆలయంలో చెల్లించి పాల్గొనవచ్చని అన్నారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి

బుచ్చినాయుడుకండ్రిగ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై త్రివర్ణ జెండాను ఎగురువేసి దేశభక్తిని చాటాలని మండల తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులతో కలసి ఆయన జాతీయ జెండాలను చేత బట్టి పురవీధులలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, డీటీ చంద్రబాబునాయుడు, హెచ్ఎం రమణయ్య పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

నాగలాపురం: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నాగలాపురం ఎంపీడీఓ పీఎంకే బాబు ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ అధికారులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ హనుమాన్ నాయక్, పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ, ఎంఈఓ బాబయ్య, హెచ్ఎం కస్తూరయ్య, వీఆర్వో నాగభూషణం పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులు మానండి

శ్రీకాళహస్తి: పురపాలక సంఘం పరిధిలో ఉన్న ఆర్పీలపై రాజకీయ వేధింపులు మానుకోవాలని సీఐటీయూ అనుబంధ ఆర్పీల పట్టణ కార్యదర్శి లక్ష్మి అన్నారు. బుధవారం పురపాలక సంఘ కార్యాలయం వద్ద సీఐటీయూ అనుబంధ ఆర్పీల సంఘం నాయకులు నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, ఆర్పీల సంఘం అధ్యక్షురాలు సరళాదేవి, సీఐటీయూ నాయకులు గురవయ్య, గంధం మణి, సంక్రాంతి వెంకటయ్య, వెలివేంద్రం, ఆర్పీలు శాంతి, అమ్ములు, సుభద్ర, లత, హబీబా తదితరులు పాల్గొన్నారు.

కళావేదిక ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న సరస్వతీబాయి పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో బుధవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పిళ్లారి దుర్గాప్రసాద్ కళావేదికను ప్రారంభించారు. బీజేపీ నాయకులు కోలా ఆనంద్, దాత పిళ్లారి అమరావతి, పల్లమాల సుధాకర్, కోటేశ్వరబాబు పాల్గొన్నారు.

పాడిరైతుల అభ్యున్నతికి కృషి

శ్రీకాళహస్తి: పాడి రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం ది కాళహస్తి మిల్క్ సొసైటీ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

నేత్రపర్వం..గంగమ్మ దర్శనం



అమ్మవారి దర్శనార్థం కిక్కిరిసిన భక్తులు (ఇన్‌సెట్) పసుపుతో రూపొందించిన గంగమ్మ ప్రతిమ

- నడివీధి గంగమ్మ దర్శనార్థం పోటెత్తిన భక్తకోటి
- సాయంత్రం నుంచి రాత్రి వరకు కుంభం సమర్పణ
- ఉప్పొంగిన భక్తి పారవశ్యం
- ముగిసిన గంగమ్మ జాతర

రేణిగుంట: పట్టణంలో గంగమ్మ జాతర నేత్రపర్వంగా సాగింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తకోటి పారవశ్యంతో ఉప్పొంగారు. తమను ఎల్లవేళలా కాపాడాలని వేడుకున్నారు. బుధవారం తెల్లవారుజామున సంప్రదాయం ప్రకారం రజకుని ఇంట పసుపు ముద్దతో ప్రత్యేకంగా తయారు చేసిన గంగమ్మ ప్రతిమను ఊరేగింపుగా తీసుకువచ్చి, నడివీధి గంగమ్మ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. నడివీధి గంగమ్మ వద్ద తయారు చేసిన వేపాకు పందిరిలో అమ్మవారి పసుపు ప్రతిమను భక్తుల దివ్య దర్శనార్థం ఉంచారు. అక్కడ ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఉదయం నుంచి భక్తులు పోటెత్తడంతో రేణిగుంట డీఎస్పీ వెంకటాద్రి, సీఐ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి క్యూలో భక్తులకు ఎలాంటి తోపులాటలు లేకుండా దర్శనం చేసుకునేలా నియంత్రించారు.



అమ్మవారి ఊరేగింపులో ఆలయ పెద్దలు



కుంభం సమర్పిస్తున్న భక్తులు

భారీగా కుంభం

సాయంత్రం అమ్మవారికి కుంభం(భోజనంతో కూడిన నైవేద్యం) పెట్టి మొక్కులు తీర్చుకునేందుకు మహిళలు, యువతులు, చిన్నారులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ఒళ్లంతా వేపాకు చుట్టుకుని బైరాగి వేషాలతో దిష్టి కుండలను నెత్తిన పెట్టుకుని మహిళలు, చిన్నారులు సమూహాలుగా గంగమ్మ వద్దకు చేరుకున్నారు. దీంతో నడివీధి గంగమ్మ ప్రాంగణమే కాకుండా ప్రధాన వీధులన్నీ భక్తకోటితో కిక్కిరిశాయి. గంగమ్మ ముంగిట కుంభం వేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జునరెడ్డి అక్కడకు చేరుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూల వద్ద వలంటీర్లను ఏర్పాటు చేశారు. నడివీధి గంగమ్మ ప్రాంగణం భక్తజన సందోహంతో కిక్కిరిసిపోవడంతో ప్రత్యేక పోలీసు దళాలు చేరుకుని, జనం మధ్యలో మఫ్టీలో తిరుగుతూ ఆకతాయిలను గుర్తించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించారు. భక్తులకు తేజ, బీడీ బాలాజీ ప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రాత్రి అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం అర్ధరాత్రి దాటాక అమ్మవారి పసుపు విగ్రహ ప్రతిమను పురవీధుల్లో డప్పు, వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగించి, నిమజ్జనం చేయడంతో జాతర ముగుస్తుంది.



అమ్మవారికి నైవేద్యం తీసుకొస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో ఏడు గంగల జాతర



నారాయణవనంలో గంగమ్మ

నారాయణవనం: మండల వాసులు బుధవారం ఏడు గంగమ్మల జాతర భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నారాయణవనం, సముదాయం, కీళగరం, వీకే పాళ్యం, నాగిలేరు, బొప్పరాజుపాళ్యంలో ఏడు గంగమ్మలు విశేషాలంకరణలతో వేర్వేరుగా మంగళవారం రాత్రి ఊరేగింపునకు బయలుదేరారు. బుధవారం వేకువ జామున నిర్దేశిత ప్రదేశాల్లో కొలువుదీరారు. మహిళలు, పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అర్ధ రాత్రి అమ్మవార్లను నిమజ్జం చేసి, పసుపును అందరికీ పంచిపెట్టారు.



సముదాయంలో..

హర్ ఘర్ తిరంగాను సద్వినియోగం చేసుకోండి



మొక్క నాటుతున్న పీడీ శ్రీనివాసులు

ఏర్పేడు: ఉపాధిహామీలో ఏర్పాటు చేసిన అమృత్ సరోవర్ హర్ ఘర్ తిరంగాను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని కొబాక పంచాయతీ కుప్పయ్యకండ్రిగ వద్ద ఉపాధిహామీ పథకంలో ఏర్పాటు చేసిన అమృత్‌సరోవర్ వద్ద స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా, ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమం నిర్వహించారు. అమృత్ సరోవర్ పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం, గ్రామస్తులు, కూలీలు హర్ ఘర్ తిరంగ యాత్ర నిర్వహించారు. ఏపీ ఓలు చంద్రశేఖర్‌రాజు, దేవరి, జేఈ బాలాజీరావు, సాంకేతిక సహాయకులు మనోహర్, పట్టాభిరెడ్డి, రవీంద్రుడు, క్షేత్ర సహాయకులు వెంకటేష్, అమ్ములు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం పోతురాజు ముందు వెళుతుండగా స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగించారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఐదు టిప్పర్లు సీజ్

సత్యవేడు: మండలంలో మంగళవారం రాత్రి ఎలాంటి పర్మిట్లు లేకుండా అక్రమంగా తమిళనాడుకు గ్రావెల్ తరలిస్తున్న ఐదు టిప్పర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. స్థానిక పోలీసు లు, మైన్ అధికారులకు సమాచారం అందించారు.

ధ్యానం నిత్యకృత్యం కావాలి

సత్యవేడు : ప్రజల జీవన శైలిలో ధ్యానం నిత్యకృత్యం కావాలని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాల నిర్వాహకులు బీకే అరుణ అన్నారు. రక్షా బంధన్‌లో భాగంగా ముందస్తుగా మండల అధికారులు, సిబ్బందికి రాఖీ కట్టారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ కే. రవి, ఏపీఎం స్వర్ణలత, సీసీ పయణీ , మహిళలు పాల్గొన్నారు.

ప్రజా కళా ఉత్సవాలను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 31వ తేదీ జరిగే ప్రజా కళా ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచులయ్య పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలో భజన కళాకారుల ఆధ్వర్యంలో ప్రజా కళా ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళా ఉత్సవాల కన్వీనర్ జనమాల గురవయ్య, జింక నాగరాజు, మించల శివకుమార్, ధనంజయులు, గంగాధరం, కృష్ణయ్య, పెంచలయ్య, గురవయ్య, బుజ్జమ్మ, అమరావతి, ధర్మవేణి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చిన్నం పెంచులయ్య

పక్కాగృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో 16 లే అవుట్లలో నిర్మిస్తున్న పక్కాగృహా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ సాయిలహరి తెలిపారు. బుధవారం సాక్షి దినపత్రికలో 'గూడు కల చెదురుతోంది' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. ఆమె బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బందితో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 16 లే అవుట్లలో హౌసింగ్ పథకంలో 950 ఇళ్లు మంజూరు కాగా అందులో 654 పూర్తి కాగా మిగిలిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. అలాగే గ్రామాల్లోని వ్యక్తిగతంగా నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. వీరందరికి సకాలంలో సిమెంట్‌తోపాటు బిల్లులను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ త్రివిక్రమ్‌రావు, ఏఈ సుబ్రమణ్యం, సిబ్బంది యుగంధర్, దయాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిలహరి

సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామ నివాసి, పాఠశాల పూర్వ విద్యార్థి, ఉద్యోగ్య రీత్యా దుబాయ్ దేశంలో ఉన్న నెల్లూరు రమేష్‌రెడ్డి, సుధీర దంపతులు రూ. 5 లక్షలతో సరస్వతి దేవి ఆలయం నిర్మించి, బుధవారం విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన గ్రామానికి, చదువుకున్న పాఠశాలకు సేవ చేయాలనే సంకల్పంతో పాఠశాలలో విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచే జ్ఞానంతో పాటు విలువలు నేర్చుకోవాలన్నారు. తమ ఊరి పాఠశాలకు ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశంతో ఈ సరస్వతీదేవి ఆలయం నిర్మించడం నా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్‌రెడ్డి తల్లిదండ్రులు బ్యాంకు విశ్రాంత మేనేజర్ సుందర్‌రెడ్డి, రాజేశ్వరి, హరిగోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్, ఉపాధ్యాయులు యువశ్రీమురళి, నాదెండ్ల మురళి, ప్రసాద్, సురేష్, వేణుగోపాల్, లక్ష్మయ్య, దేవేంద్ర, దాసు, మాధవీలత, జగన్నాథం, దీపిక, రామదాసు, శివకుమార్, గిరిధర్‌రెడ్డి, ధనంజయులురెడ్డి, సర్పంచ్ రాగమ్మ, తిరుపాలయ్య తదితరులు పాల్గొన్నారు.



సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న రమేష్ రెడ్డి దంపతులు, ఉపాధ్యాయులు

మండల మహిళా సమాఖ్య ఎన్నిక

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని వెలుగు కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం జరిగింది. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా సుప్రజ, కార్యదర్శిగా సురేఖ, కోశాధికారిగా సుమలత, ఉపాధ్యక్షురాలిగా సుబ్బమ్మ, ఉపకార్యదర్శిగా నిర్మల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏరియా కోఆర్డినేటర్ ధనంజయరెడ్డి, ఏపీఎం మునెయ్య, సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరేష్, లీగల్ కోఆర్డినేటర్ గెరటూరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించండి

శ్రీకాళహస్తి: దేశంలో మహిళలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. తొట్టంబేడు బాలికల జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి మహిళలపై లైంగికదాడులకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం పట్టణాధ్యక్షుడు చుట్టు గురవయ్య మాట్లాడుతూ మోదీ పాలనలో మహిళలకు భద్రత కరువైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, సుకుమార్, శశి, సాయి, హేమంత్, శ్యామ్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉద్దికేశులమ్మ తిరునాళ్ల



ఊరేగుతున్న ఉద్దికేశులమ్మ

నాగలాపురం: గ్రామదేవత ఉద్దికేశులమ్మ జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని వేకువజామున శుద్ధి చేసి, విద్యుత్‌దీప అలంకరణతో, వివిధ రకాల పూలు, వేపాకు, నిమ్మకాయల దండలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణలో మహిళలు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి మొక్కులును చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు జానకిరామన్ ఉద్దికేశులమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం సాయంత్రం 7.30 గంటలకు ఉద్దికేశులమ్మ ఉత్సవమూర్తికి విశేషాలంకరణ చేసి ఊరేగించారు. ఎస్ఐ ఓబయ్య బందోబస్తు నిర్వహించారు.

నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలి

సత్యవేడు: మండలంలోని గ్రామ సమాఖ్య సంఘాలు నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలని ఏపీఎం స్వర్ణలత కోరారు. బుధవారం స్త్రీశక్తి భవనంలో మండల మహిళా సమైక్య సర్వసభ్యసమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షురాలిగా కోటేశ్వరి, ఉపాధ్యక్షులుగా నందిని, కార్యదర్శిగా మంజుల, ఉపకార్యదర్శిగా పద్మమ్మ, కోశాధికారిగా సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.